దిగ్వేశ్‌కు జరిమానా

ముంబై: లక్నో సూపర్ జెయింట్స్ స్పిన్నర్ దిగ్వేశ్ సింగ్‌కు బీసీసీఐ షాకిచ్చింది. మంగళవారం పంజాబ్‌తో జరిగిన మ్యాచ్‌లో అతడు.. కింగ్స్ బ్యాటర్ ప్రియాన్ష్‌ను ఔట్ చేయగానే అతడి వద్దకు వెళ్లి పెన్ను పేపర్‌తో ఏదో రాసిన ట్టుగా 'నోట్‌బుక్ సెలెబ్రేషన్' చేసుకున్నాడు. ఇందుకు గాను లెవల్-1 తప్పిదం కింద దిగ్వేశ్ మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత పడింది.

హైదరాబాద్‌కు మొండిచేయి!

- **విండీస్, సఫారీ సిరీస్‌ల షెడ్యూల్ విడుదల**

ఢిల్లీ: ఈ ఏడాది స్వదేశంలో భారత క్రికెట్ జట్టు ఆతిథ్యమివ్వబోయే క్రికెట్ సిరీస్‌ల షెడ్యూల్‌ను బీసీసీఐ బుధవారం విడుదల చేసింది. అక్టోబర్‌లో వెస్టిండీస్‌తో రెండు టెస్టులు ఆడనున్న టీమ్‌ఇండియా.. నవంబర్-డిసెంబర్‌లో దక్షిణాఫ్రికాతో రెండు టెస్టులు, మూడు వన్డేలు, ఐదు టీ20లు ఆడనుంది. అయితే హైదరాబాద్‌కు ఒక్క మ్యాచ్‌కు ఆతిథ్యమిచ్చే అవకాశం లభించలేదు. రొటేషన్ పద్ధతికి దాదాపు తిలోదాఖలు ఇచ్చిన బోర్డు హైదరాబాద్ క్రికెట్ అభిమానులకు మరోమారు నిరాశనే మిగిల్చింది. విండీస్‌తో అక్టోబర్ 6న అహ్మదాబాద్‌లో తొలి టెస్టు, 14 నుంచి కోల్‌కతాలో రెండు టెస్టు జరుగనుంది. దక్షిణాఫ్రికాతో సిరీస్ వివరాలు కింది విధంగా ఉన్నాయి.

నవంబర్ 18	తొలి టెస్టు	ఢిల్లీ
నవంబర్ 26	రెండో టెస్టు	గువహతి
నవంబర్ 30	తొలి వన్డే	రాంచీ
డిసెంబర్ 03	రెండో వన్డే	రాయ్‌పూర్
డిసెంబర్ 06	మూడో వన్డే	వైజాగ్
డిసెంబర్ 09	తొలి టీ20	కటక్
డిసెంబర్ 11	రెండో టీ20	చండీగఢ్
డిసెంబర్ 14	మూడో టీ20	ధర్మశాల
డిసెంబర్ 17	నాలుగో టీ20	లక్నో
డిసెంబర్ 19	ఐదో టీ20	అహ్మదాబాద్

జీటీ జోరు

సిరాజ్, బట్లర్ విజృంభణ

ఆర్‌సీబీపై ఘన విజయం

బెంగళూరు: రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)కి సొంతగడ్డపై చుక్కెదురైంది. ఆడిన రెండు మ్యాచ్‌ల్లో గెలిచి అజేయంగా దూసుకెళుతున్న ఆర్‌సీబీకి గుజరాత్ టైటాన్స్(జీటీ) బ్రేక్‌లు వేసింది. బుధవారం చిన్నస్వామి స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో జీటీ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత ఆర్‌సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 169/8 స్కోరు చేసింది. లివింగ్‌స్టన్(40 బంతుల్లో 54, ఫోర్, 5సిక్స్‌లు) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. సిరాజ్ (3/19), సాయికిషోర్ (2/22) అదరగొట్టారు. ముఖ్యంగా సిరాజ్.. సాల్ట్ (14), పడిక్కల్ (4), లివింగ్‌స్టన్‌ను ఔట్ చేసి ఆర్‌సీబీని దెబ్బకొట్టాడు. లక్ష్యఛేదనను గుజరాత్ 17.5 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి విజయాన్నందుకుంది. బట్లర్(39 బంతుల్లో 73 నాటౌట్, 5ఫోర్లు, 6సిక్స్‌లు) ధనాధన్ అర్ధసెంచరీతో చెలరేగగా, సుదర్శన్ (49), రూథర్‌ఫర్డ్(30 నాటౌట్) ఆకట్టుకున్నారు. భువనేశ్వర్ (1/23), హాజిల్‌వుడ్(1/43) ఒక్కో వికెట్ తీశారు. సిరాజ్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

బట్లర్ బాదేశాడు:

భారీ మెరుపులేమీ లేకపోయినా ఛేదనలో గుజరాత్ ఇన్నింగ్స్ వేగంగానే మొదలైంది. ఓ సిక్స్, బౌండరీతో టచ్‌లోనే కనిపించిన సారథి గిల్ (14).. భువనేశ్వర్ ఐదో ఓవర్లో లివింగ్‌స్టన్‌కు క్యాచ్ ఇచ్చి నిష్క్రమించాడు. మరో ఎండ్‌లో సుదర్శన్ వేగంగా ఆడుతూ రన్‌రేట్ పడిపోకుండా జాగ్రత్తపడ్డాడు. గిల్ నిష్క్రమణతో వన్‌డౌన్‌లో వచ్చిన బట్లర్.. రసిక్ సలమ్ 9వ ఓవర్లో గేర్ మార్చి 4, 6, 6 బాది టైటాన్స్ ఇన్నింగ్స్‌కు ఊపుతెచ్చాడు. బట్లర్ స్ఫూర్తితో సుదర్శన్ కూడా కృనాల్ 12వ ఓవర్లో రెండు బౌండరీలు రాబట్టాడు. 13వ ఓవర్లో బంతిని మార్చడం బెంగళూరుకు కలిసొచ్చింది. హేజిల్‌వుడ్ ఓవర్లో సుదర్శన్.. అనవసరపు షాట్ ఆడి జితేశ్‌కు క్యాచ్ ఇవ్వడంతో రెండో వికెట్‌కు 75 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. పరుగు తేడాతో సుదర్శన్ అర్ధసెంచరీ సాధించే అవకాశాన్ని కోల్పోయాడు. సుదర్శన్ స్థానంలో క్రీజులోకొచ్చిన రూథర్‌ఫర్డ్..బట్లర్‌కు జతకలిశాడు. అప్పటికే క్రీజులో పాతుకుపోయిన బట్లర్..బెంగళూరు బౌలర్లను ఆటాడుకున్నాడు. లివింగ్‌స్టన్ 15వ ఓవర్‌లో ఫోర్, సిక్స్‌తో బట్లర్ అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. మరో వికెట్ పడకుండానే బట్లర్, రూథర్‌ఫర్డ్ గుజరాత్ గెలుపు లాంఛనాన్ని పూర్తి చేశారు.

బట్లర్ (73 *)

టాపార్డర్ టపటప..

ఓపెనర్లపై అతిగా ఆధారపడి వాళ్లు విఫలమైతే ఏం జరుగుతుందో బెంగళూరుకు మూడో మ్యాచ్‌లోనే తెలిసొచ్చింది. 38/3.. తొలి పవర్ ప్లేలో ఆర్‌సీబీ స్కోరిది. గత రెండు మ్యాచ్‌లలో ఆ జట్టు పవర్ ప్లే (కోల్‌కతాపై 80/0, చెన్నైపై 56/1)లోనే ప్రత్యర్థులపై విరుచుకుపడినా సొంతగడ్డపై మాత్రం తేలిపోయింది. రెండో ఓవర్లో కోహ్లీ నిష్క్రమించాడో లేదో ఆ జట్టు టాపార్డర్ పెవిలియన్‌కు క్యూకట్టింది. అర్షద్ ఖాన్ (1/17) రెండో ఓవర్లో నాలుగో బంతిని బ్యాక్‌వర్డ్ స్క్వేర్ దిశగా షాట్ ఆడబోయిన కోహ్లీ.. అక్కడే ఉన్న ప్రసిధ్ చేతికి చిక్కాడు. ఆ తర్వాత సిరాజ్ వరుస ఓవర్లలో.. పడిక్కల్ (4), సాల్ట్ (14)ను ఔట్ చేసి బెంగళూరును ఒత్తిడిలోకి నెట్టాడు. 7వ ఓవర్లో బౌలింగ్ మార్పుగా వచ్చిన ఇషాంత్ శర్మ (1/27).. కెప్టెన్ రజత్ పటిదార్ (12)ను వికెట్ల ముందు దొరకబుచ్చుకోవడంతో బెంగళూరు కష్టాలు రెట్టింపయ్యాయి.

ఆ ముగ్గురి మెరుపులతో..

42 పరుగులకే 4 కీలక వికెట్లు కోల్పోయిన ఆతిథ్య జట్టును జితేశ్, లివింగ్‌స్టన్ ఆదుకున్నారు. ఇషాంత్ 9వ ఓవర్లో జితేశ్.. 6, 4, 4తో ఎదురుదాడికి దిగాడు. కానీ సాయికిషోర్ 13వ ఓవర్లో తెవాటియా చేతికి చిక్కడంతో 52 బంతుల ఐదో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. కృనాల్ (5) సైతం నిరాశపరిచాడు. ఆరంభంలో తన శైలికి భిన్నంగా ఆడిన లివింగ్‌స్టన్.. రషీద్ ఖాన్ 18వ ఓవర్లో 6, 6, 6తో గేర్ మార్చి 39 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తిచేశాడు. ఆఖర్లో టిమ్ డేవిడ్ (18 బంతుల్లో 32, 3 ఫోర్లు, 2 సిక్సర్లు) మెరుపులతో బెంగళూరు పోరాడగలిగే స్కోరును సాధించింది.

సిరాజ్ (3/19),

పాయింట్ల పట్టిక

జ	మ్యా	గె	ఓ	పా	ర.రే
పంజాబ్	2	2	0	4	1.48
ఢిల్లీ	2	2	0	4	1.32
బెంగళూరు	3	2	1	4	1.14
గుజరాత్	3	2	1	4	0.80
ముంబై	3	1	2	2	0.30
లక్నో	3	1	2	2	-0.15
చెన్నై	3	1	2	2	-0.77
హైదరాబాద్	3	1	2	2	-0.87
రాజస్థాన్	3	1	2	2	-1.11
కోల్‌కతా	3	1	2	2	-1.42

నోట్: జ- జట్టు, మ్యా. మ్యాచ్, గె-గెలుపు, ఓ-ఓటమి, పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

సంక్షిప్త స్కోర్లు

బెంగళూరు: 169/8 (లివింగ్‌స్టన్ 54, జితేశ్ 33, సిరాజ్ 3/19, సాయి 2/22); గుజరాత్: 17.5 ఓవర్లలో 170/2(బట్లర్ 73 నాటౌట్, సుదర్శన్ 49,భువనేశ్వర్ 1/23, హాజిల్‌వుడ్ 1/43)

ముంబైని వీడిన జైస్వాల్

ముంబై: టీమ్‌ఇండియా యువ ఓపెనర్, ముంబైలో క్రికెట్ ఓనమాలు నేర్చుకుని జాతీయ జట్టుకు ఎంపికైన యశస్వి జైస్వాల్ దేశవాళీలో ఆ జట్టుకు గుడ్‌బై చెప్పాడు. ఈ మేరకు అతడు తనను జట్టు నుంచి రిలీవ్ చేసినో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌వోసీ) ఇవ్వాలని మంగళవారం ముంబై క్రికెట్ అసోసియేషన్ (ఎంసీఏ)కు లేఖ రాయడం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. జైస్వాల్ అభ్యర్థనను ఎంసీఏ అంగీకరించింది. రాబోయే సీజన్ (2025-26) నుంచి జైస్వాల్ గోవా తరపున ఆడనున్నాడు. జాతీయ జట్టు బాధ్యతలు లేనప్పుడు అతడు గోవాకు సారథిగా వ్యవహరించనున్నట్టు గోవా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి శంబా దేశాయ్ తెలిపాడు. 2019 నుంచి ముంబైకి ఆడుతున్న జైస్వాల్.. అన్ని ఫార్మాట్లలో కలిపి 63 మ్యాచ్‌లు ఆడాడు.

కివీస్‌దే వన్డే సిరీస్

మిచెల్ (99*)

హమిల్టన్(న్యూజిలాండ్): స్వదేశంలో పాకిస్థాన్‌తో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌ను న్యూజిలాండ్ మరో మ్యాచ్ మిగిలుండగానే 2-0తో కైవసం చేసుకుంది. టీ20 సిరీస్‌లో చిత్తుగా ఓడిన పాక్.. అదే వైఫల్యాల పరంపరను కొనసాగిస్తున్నది. హమిల్టన్ వేదికగా ఇరు జట్ల మధ్య జరిగిన రెండో వన్డేలో ఆతిథ్య కివీస్.. పాక్‌పై 84 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. వికెట్ కీపర్ మిచెల్ హే (78 బంతుల్లో 99 నాటౌట్, 7 ఫోర్లు, 7 సిక్సర్లు), మహ్మద్ అబ్బాస్ (41) రాణించడంతో మొదట బ్యాటింగ్ చేసిన కివీస్ 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 292 పరుగులు చేసింది. ఛేదనలో పాక్ 41.2 ఓవర్లలో 208 పరుగులకే కుప్పకూలింది. లోయరార్డర్‌లో ఫహీమ్ అష్రఫ్ (73), నసీమ్ షా (51) ఆదుకున్నారు. కివీస్ పేసర్ బెన్ సీర్స్ (5/59) ఐదు వికెట్ల ప్రదర్శన చేయగా జాకబ్ డఫ్ఫీ (3/35) రాణించాడు.

సంజూకు లైన్‌క్లియర్

బెంగళూరు: ఐపీఎల్-18లో తొలి మూడు మ్యాచ్‌లకు స్పెషలిస్ట్ బ్యాటర్‌గానే కొనసాగిన సంజూ శాంసన్.. తిరిగి రాజస్థాన్ రాయల్స్‌కు సారథిగా వ్యవహరించనున్నాడు. కుడిచేతి చూపుడు వేలికి గాయం కారణంగా రెండు వారాల పాటు వికెట్ కీపింగ్ చేయొద్దని బీసీసీఐ అతడికి సూచించిన నేపథ్యంలో గత మూడు మ్యాచ్‌లలో సంజూ కీపర్‌గానే గాక సారథ్య బాధ్యతలకూ దూరంగా ఉన్నాడు. దీంతో రియాన్ పరాగ్ రాజస్థాన్‌ను నడిపించాడు. తాజాగా సంజూకు నేషనల్ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) నుంచి క్లియరెన్స్ లభించడంతో అతడు ఈనెల 5న పంజాబ్‌తో జరిగే మ్యాచ్‌తో కెప్టెన్సీ పగ్గాలు చేపట్టనున్నాడు.

సెమీస్‌కు జదుమణి

ఢిల్లీ: భారత యువ బాక్సర్ జదుమణి సింగ్ ప్రపంచ బాక్సింగ్ కప్‌లో సెమీఫైనల్ చేరాడు. బ్రెజిల్‌లోని ఇగాకులో జరుగుతున్న ఈ టోర్నీలో భాగంగా పురుషుల 50 కిలోల విభాగంలో బరిలోకి దిగిన జదుమణి క్వార్టర్స్‌లో 3-2తో ఎల్లిస్ ట్రోబ్రిడ్జ్ (బ్రిటన్)ను చిత్తుచేశాడు. జదుమణి సెమీస్ చేరినా మరో ముగ్గురు భారత బాక్సర్లు ఆరంభ బౌట్‌లోనే వెనుదిరిగారు. నరేందర్ (90 కిలోలు), నిఖిల్ దూబే (75 కిలోలు), జుగ్నో (85 కిలోలు) నిరాశపరిచారు.

తొలి ప్రపంచకప్ స్వర్ణోత్సవ సంబురాలు

బార్బడోస్: సరిగ్గా 50 ఏండ్ల క్రితం తొలి వన్డే ప్రపంచకప్‌ను నెగ్గి చరిత్ర సృష్టించిన వెస్టిండీస్ ఈ ఏడాది స్వర్ణోత్సవ సంబురాలను ఘనంగా నిర్వహించేందుకు సిద్ధమైంది. దిగ్గజ సారథి క్లైవ్ లాయిడ్ సారథ్యంలో ప్రఖ్యాత లార్డ్స్ క్రికెట్ స్టేడియం వేదికగా 1975, జూన్ 21 వెస్టిండీస్.. ఆస్ట్రేలియాను 17 పరుగుల తేడాతో ఓడించి మొదటి ప్రపంచకప్ (ప్రుడెన్షియల్ వరల్డ్ కప్)ను గెలుచుకుంది. దీనిపై క్రికెట్ వెస్టిండీస్ (సీడబ్ల్యూఐ) సీఈవో క్రిస్ డెహ్రింగ్ స్పందిస్తూ.. 'అవును. మేం స్వర్ణోత్సవ పండుగ చేసుకోబోతున్నాం. అయితే ఇందుకు సంబంధించిన తేదీ, ఇతర వివరాలు త్వరలోనే ప్రకటిస్తాం' అని తెలిపాడు. ఈ ఏడాది జూన్ 25న బార్బడోస్‌లో ఈ వేడుకలను నిర్వహించనున్నట్టు సమాచారం.

పంత్‌పై గోయెంకా రుసరుస!

పంజాబ్ చేతిలో ఓటమిపై ఆగ్రహం

లక్నో: లక్నో సూపర్‌జెయింట్స్(ఎల్ఎస్‌జీ) యజమాని సంజీవ్ గోయెంకా తన వైఖరిని మరోమారు బయటపెట్టుకున్నాడు. సీజన్లు మారుతున్నా..తన ప్రవర్తనలో ఇసుమంతైనా తేడా లేదని నిరూపించుకున్నాడు. మంగళవారం పంజాబ్ కింగ్స్ చేతిలో మ్యాచ్ ఓడిన తర్వాత మైదానంలోకి వచ్చిన గోయెంకా ప్లేయర్లను పలకరిస్తూ కెప్టెన్ రిషబ్ పంత్ దగ్గర ఆగిపోయాడు. పంజాబ్ చేతిలో భారీ ఓటమిని ప్రస్తావిస్తూ పంత్‌పై రుసరుసలాడుతూ కనిపించాడు. కెప్టెన్‌కు ఏమాత్రం గౌరవం ఇవ్వకుండా సంజ్ఞలు చేస్తూ ఆగ్రహం ప్రదర్శించాడు. మెగావేలంలో రికార్డు స్థాయిలో 27 కోట్లు పెట్టి తీసుకున్న పంత్ పేలవ ప్రదర్శన పట్ల గోయెంకా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు కనిపిస్తున్నది.

చిత్రం

స్వార్థాన్ని నరికివేయండి..చెట్లను కాదు!

హెచ్‌సీయూ ఘటనలపై కథానాయికల ఆగ్రహం

విద్యార్థులకు మద్దతుగా సోషల్‌మీడియాలో పోస్టులు

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన కంచె గచ్చిబౌలి అటవీ భూముల్లో వేలం పేరిట రేవంత్ ప్రభుత్వం సాగిస్తున్న దమనకాండపై సినీ ప్రముఖుల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నది. గ్రీన్ లంగ్స్ ఆఫ్ హైదరాబాద్‌గా అభివర్ణించే ఈ ప్రాంతంలో చెట్ల నరికివేతను వెంటనే ఆపాలని, జీవ వైవిధ్యాన్ని కాపాడాలని సోషల్‌మీడియా వేదికగా వారు ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నారు. ఇప్పటికే ఈ విషయంపై ప్రముఖ నటుడు ప్రకాష్‌రాజ్, దర్శకుడు నాగ్‌అశ్విన్ స్పందించగా..తాజాగా అగ్ర కథానాయికలు కొందరు తెలంగాణ ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా గళం విప్పారు. హెచ్‌సీయూ విద్యార్థుల పోరాటానికి మద్దతు ప్రకటిస్తూ, అటవీ ధ్వంసాన్ని వెంటనే ఆపాలని కోరారు.

మంగళవారం హెచ్‌సీయూ ఘటనపై తన స్పందనను తెలియజేసిన సీనియర్ నటి రేణూదేశాయ్ మరోమారు ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియోను విడుదల చేశారు. 'ప్రజలందరి పక్షాన ఈ వీడియో ద్వారా సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నా. నాకు రెండు రోజుల క్రితం హెచ్‌సీయూ ఘటనల గురించి తెలిసింది. మిత్రుల ద్వారా కొంత సమాచారాన్ని సేకరించి ఈ వీడియోతో ముందుకొచ్చాను. సీఎంగారు..ఓ తల్లిగా నేను మిమ్మల్ని అభ్యర్థిస్తున్నా. మన భవిష్యత్తు తరాల కోసం ఆక్సిజన్, చెట్లు అవసరమవుతాయి. ఐటీ పార్కులు, ఆకాశహర్మ్యాలతో కూడిన అభివృద్ధి అవసరమే.. కానీ ఈ 400 ఎకరాల భూమిని మాత్రం వదిలివేయమని మిమ్మల్ని కోరుతున్నా. తెలంగాణలో నివసిస్తున్న పౌరురాలిగా మీకు నా అభ్యర్థన ఇది. అభివృద్ధి చేయాలంటే ఇతర ప్రాంతాల్లో వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఆక్సిజన్ కోసం మనకు చక్కటి పర్యావరణం అవసరం కాబట్టి ఆ 400 ఎకరాలను వదిలిపెట్టమని అడుగుతున్నా. హెచ్‌సీయూ భూముల వేలం విషయంలో మీరు, మీ అధికారులందరూ పునరాలోచన చేసి మంచి నిర్ణయాన్ని తీసుకుంటారని ఆశిస్తున్నా' అని పేర్కొన్నారు. మరో పోస్ట్‌లో... కోర్టు ఆదేశాలను ధిక్కరించి బుధవారం సాయంత్రం కూడా అటవీ ధ్వంసం చేశారని రేణూదేశాయ్ ఆగ్రహం వ్యక్తం చేసింది.

- 'రాత్రికి రాత్రే బుల్డోజర్ల మోహరింపు, విద్యార్థుల అరెస్టులు, అసలు హెచ్‌సీయూలో ఏం జరుగుతున్నది' అనే క్యాప్షన్స్‌తో కూడిన ఫొటోలను తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసిన అగ్ర కథానాయిక రష్మిక మందన్న.. వృక్ష సంపదను ధ్వంసం చేస్తూ ప్రభుత్వం అనుసరిస్తున్న దుర్మార్గమైన వైఖరిని తప్పుపట్టింది. 'నేను ఇప్పుడే ఈ వీడియోలను చూశాను. నా హృదయం ముక్కలైంది. ఇది ఏమాత్రం అంగీకారం కాదు. మంచిది కూడా కాదు' అంటూ రష్మిక మందన్న తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో ఆవేదన వ్యక్తం చేసింది. పోస్ట్ చేసిన నిమిషాల్లోనే రష్మిక మాటలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి.
- గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ అటవీ ప్రాంతంలో జీవ వైవిధ్యం, వన్యప్రాణులకు సంబంధించిన వీడియోను కథానాయిక వరలక్ష్మీ శరత్‌కుమార్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పంచుకుంది. 'సేవ్ సిటీ ఫారెస్ట్' అనే సంస్థ పోస్ట్‌ను కూడా షేర్ చేసిన వరలక్ష్మీ శరత్‌కుమార్ వెంటనే ఈ విధ్వంసానికి అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వాన్ని కోరింది.
- అటవీ నిర్మూలన వల్ల కంచె గచ్చిబౌలిలో 1 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత పెరిగే అవకాశం ఉందని ఎకలాజికల్ హెరిటేజ్ సంస్థ రిపోర్టును ఉటంకిస్తూ 'తెలంగాణ టుడే' పత్రిక పబ్లిష్ చేసిన ఆర్టికల్‌ను తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో షేర్ చేసింది సమంత. దీనితో పాటు అటవీ విధ్వంసం సందర్భంగా నెమళ్లు, జింకలు అరుస్తున్న వీడియోను సైతం తన ఖాతాలో షేర్ చేసింది.
- హెచ్‌సీయూ విద్యార్థుల నిరసనలు, బుల్డోజర్లతో అటవీ నేలమట్టం తాలూకు వరుస వీడియోలు, నెమళ్ల ఆక్రందనల వీడియోలను తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో పంచుకుంది కథానాయిక రెజీనా కాసాండ్రా. వేలానికి వ్యతిరేకంగా వివిధ ఆంగ్ల పత్రికల్లో వచ్చిన కథనాలను కూడా పంచుకుంది. పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగించే ఈ పనులను వెంటనే నిలిపివేయాలని కోరింది.
- స్వార్థాన్ని నరికివేయండి, చెట్లను కాదు, ప్రకృతిని కాపాడండి, ప్రతి వన్యప్రాణి మన మనుగడకు ప్రధానమే అనే రైటింగ్స్‌లో కూడిన వీడియోను తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో పంచుకుంది అగ్ర కథానాయిక శ్రీలీల.
- 'ప్రకృతి సంపదను పరిరక్షించి భవిష్యత్తు తరాలకు అందించాలనే తపనతో విద్యార్థులు పోరాటం చేస్తున్నారు. ఐటీ పార్కులకంటే అడవిని కాపాడుకుంటేనే రేపటి మన భవిష్యత్తు భద్రంగా ఉంటుంది. జీవ వైవిధ్యాన్ని ధ్వంసం చేస్తూ దానినే అభివృద్ధి అనుకుంటే చివరకు అది విధ్వంసానికి దారితీస్తుంది' అంటూ సీనియర్ నాయిక, హైదరాబాద్‌కు చెందిన దియా మిర్జా తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ఆవేదన వ్యక్తం చేసింది.
- హెచ్‌సీయూ పరిధిలోని 400 ఎకరాల కంచె గచ్చిబౌలి అటవీ ప్రాంతాన్ని ధ్వంసం చేయడంపై బాలీవుడ్ నటి రిచా చద్దా ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై ఆమె విమర్శలు గుప్పించారు. విద్యార్థులపై లాఠీ చార్జి చేయడం, వందలాది మందిని అరెస్టు చేసినప్పటికీ రాహుల్‌గాంధీ మౌనంగా ఉండటాన్ని ఆమె తప్పుబట్టారు. ఈ మేరకు ఓ విద్యార్థులను పోలీసులు వ్యాన్లలోకి ఈడ్చుకెళ్తున్న వీడియోను ఆమె సోషల్ మీడియాలో షేర్ చేశారు. 'హే..! రాహుల్‌గాంధీ.. మీ వద్ద ప్రేమ చాలా ఎక్కువగా ఉంటుంది కదా. ఆ ప్రేమలో కొంచెమైనా ప్రకృతిపై చూపండి' అని చెబుతూ రాహుల్‌గాంధీ, తెలంగాణ సీఎంవోను ట్యాగ్ చేశారు. 'అర్ధరాత్రి చిమ్మచీకట్లో చెట్లు ఎందుకు నరుకుతున్నారు. చిమ్మచీకట్లో పని చేసేదెవరు? దొంగలే కదా?' అని తీవ్రంగా స్పందించారు. వాతావరణ మార్పులపై చూపే ప్రభావం గురించి నటి రిచా చద్దాను 'ది టెలిగ్రాఫ్' ప్రశ్నించగా ఆమె స్పందించారు. 'ఇప్పటికే మనం తీవ్రమైన ఉష్ణోగ్రతలను చవిచూస్తున్నాం. పర్యావరణ సూచీలో భారత్ 180 దేశాల్లో 176వ స్థానంలో ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో జీవవైవిధ్యానికి ఆలవాలమైన అటవీని పూర్తిగా ధ్వంసం చేసి ఐటీ హబ్‌లను నెలకొల్పడమంటే భయకంపిత సమాజం వైపు అడుగులు వేయడమే' అని ఆమె అన్నారు.

అన్ని ప్రశ్నలకు సమాధానం!

ఈ ఏడాది మొత్తం వరుస సినిమాలతో బిజీబిజీగా గడపనున్నారు అగ్ర హీరో ఎన్టీఆర్. ఇప్పటికే తొలి హిందీ స్ట్రెయిట్ చిత్రం 'వార్-2' షూటింగ్‌ను పూర్తి చేసుకున్నారు. త్వరలో 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో తెరకెక్కనున్న సినిమా కోసం సిద్ధమవుతున్నారు. 'దేవర-2' సైతం ఈ ఏడాదిలోనే సెట్స్‌మీదకు వెళ్లనుంది. సోలో హీరోగా ఎన్టీఆర్ కెరీర్‌లోనే 'దేవర' బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. దీంతో సీక్వెల్‌పై అభిమానులు భారీ అంచనాలను పెట్టుకున్నారు. దర్శకుడు కొరటాల శివ ప్రస్తుతం ఈ స్క్రిప్ట్‌పై తన టీమ్‌తో పనిచేస్తున్నారు. ఇదిలావుండగా ఇటీవల 'దేవర' సినిమా జపాన్ రిలీజ్ నేపథ్యంలో అక్కడకు వెళ్లి అభిమానులను కలుసుకున్నారు ఎన్టీఆర్. స్థానిక మీడియాతో కూడా ముచ్చటించారు. ఈ నేపథ్యంలో 'దేవర-2' గురించి ఆయన ఇచ్చిన అప్‌డేట్ ఆసక్తికరంగా మారింది. ఈ సీక్వెల్‌లో వర పాత్ర గురించి ప్రేక్షకులు ఎక్కువగా తెలుసుకుంటారని, అసలు దేవరకు ఏమైంది అనే బ్యాక్‌స్టోరీకి సమాధానం కూడా సీక్వెల్‌నే ఉంటుందని, అనేక ప్రశ్నలకు సమాధానంగా రెండో భాగం నిలుస్తుందని ఎన్టీఆర్ పేర్కొన్నారు. ఈ తాజా అప్‌డేట్‌తో సీక్వెల్ ఎప్పుడు పట్టాలెక్కుతుందోనని అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు.

పర్యావరణ సందేశంతో 'ఫణి'

కేథరిన్ ట్రెసా ప్రధాన పాత్రలో నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'ఫణి'. వి.ఎన్.ఆదిత్య దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఓ.ఎం.జీ ప్రొడక్షన్స్ పతాకంపై డాక్టర్ మీనాక్షి అనిపిండి నిర్మిస్తున్నారు. మహేష్‌శ్రీరామ్ కీలక పాత్రధారి. బుధవారం హైదరాబాద్‌లో దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు చేతుల మీదుగా మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. తొలుత చిన్న చిత్రంగా ఆరంభమైన ఈ ప్రాజెక్ట్ అనంతరం గ్లోబల్ మూవీగా తయారైందని, ఇందులో పాము పాత్ర చాలా కీలకంగా ఉంటుందని చిత్ర నిర్మాత, సంగీత దర్శకురాలు డా॥ మీనాక్షి పేర్కొన్నారు. తన మీద నమ్మకంతో సోదరి మీనాక్షి, బావ శాస్త్రి ఈ సినిమా ద్వారా ప్రొడక్షన్‌లోకి ఎంటరయ్యారని, వినూత్నమైన కాన్సెప్ట్‌తో గ్లోబల్ మూవీగా తెరకెక్కించామని, త్వరలోనే ప్రేక్షకుల ముందుకుతీసుకొస్తామని దర్శకుడు వి.ఎన్.ఆదిత్య తెలిపారు. ఇలాంటి వైవిధ్యమైన కథలో ఎప్పుడూ నటించలేదని, పాము నేపథ్యంలో వచ్చే సన్నివేశాలు హైలైట్‌గా నిలుస్తాయని కథానాయిక కేథరిన్ తెలిపింది. ఈ కథలో 'భూమి మనది మాత్రమే కాదు..ప్రకృతిది కూడా' అనే గొప్ప సందేశం ఉంటుందని రైటర్ పద్మ అన్నారు. భారీ స్థాయిలో విడుదలకు సన్నాహాలు చేస్తున్నామని చిత్ర సమర్పకులు పద్మనాభ రెడ్డి చెప్పారు. ఈ చిత్రానికి సమర్పణ: ఏయు అండ్ ఐ స్టూడియో పద్మనాభ రెడ్డి, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: వీఎన్ ఆదిత్య.

దిల్‌రాజు 60వ సినిమా

అగ్ర నిర్మాత దిల్‌రాజు సారథ్యంలోని ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్‌కు సంబంధించిన 60వ సినిమా ప్రకటన బుధవారం వెల